RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
MAHI NEWS
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
మహి న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 60, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 8, వెల రూ. 2, /- మంగళవారం -02 - జూన్ - 2026
published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana



### విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన
## ఓటుతో విముక్తి కల్పించారు
### మీటింగ్ ల నుంచి జనం వెళ్లిపోకుండా
### కందకాలు తవ్వారు: చామవరం సభలో చంద్రబాబు

తుని నియోజకవర్గం చామవరంలో 'పేదల సేవలో' సభ

గత ప్రభుత్వంపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు

నాడు భయానక వాతావరణం ఉండేదని విమర్శలు

బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యలు

అది చరిత్రలో నిలిచిపోయే రోజన్న చంద్రబాబు

అమరావతి: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భయానక వాతావరణం ఉండేదని, బహిరంగ సభలకు వచ్చిన ప్రజలు మధ్యలో వెళ్లిపోకుండా అడ్డుకోవడానికి ఏకంగా కందకాలు తవ్వి, ఫెన్సింగ్‌లు వేసి నిర్బంధించే దుస్థితి ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. మిగతా 2 లో

## 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి: కేటీఆర్

జూన్ 25 నుండి సర్ ప్రారంభమవుతుంది




"కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేది

65 సంవత్సరాలలో కాంగ్రెస్ చేయని పని ఆరు నెలల్లో కేసీఆర్ చేసి చూపించారు

24 గంటల పాటు రైతులకు, పరిశ్రమలకు కేసీఆర్ నాణ్యమైన కరెంటు ఇచ్చారు"

### ఇరాన్ రాజకీయాల్లో కార్చిచ్చు: 'సైనిక తిరుగుబాటు' అంటూ
## అధ్యక్షుడు పెజెష్కియాన్ రాజీనామా




ఐఆర్‌జీసీ కమాండర్ల చేతుల్లోకి వెళ్లిన దేశ సర్వాధికారాలు

క్షిపణి దాడులను 'పిచ్చిచర్య'గా అభివర్ణించిన అధ్యక్షుడు

సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీకి లేఖ

టెహ్రాన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం!

# పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి

★ పన్నుల ఎగవేత దారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం.. డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!

★ పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న



అమరావతి: గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై మిగతా 2 లో




### రైతు డిస్కం పేరిట విద్యుత్తు ప్రైవేటీకరణకు కుట్ర: కె.కవిత

- రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతు డిస్కం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం'
- 'ఆరు నెలలుగా రహస్యంగా ఉంచిన రైతు డిస్కం అంశాన్ని ఇప్పుడు బయటపెట్టడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది
- మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి
- పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దసరాలోపు ప్రారంభించాలి

### పశ్చిమాసియాలో శాంతికి
## 'భారత్' ఒక్కటే మార్గం

### పశ్చిమాసియా స్థిరత్వంలో భారత్‌ది కీలక పాత్రన్న ఇజ్రాయెల్ రాయబారి

భారత్ ఆర్థిక వృద్ధి ద్వారా ఈ ప్రాంతానికి ట్రిలియన్ డాలర్ల లబ్ధి

భారతీయుల్లో ఇజ్రాయెల్ పట్ల 'క్రేజీ లవ్' ఉందన్న ప్రధాని నెతన్యాహు



ఢిల్లీ: భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి మిగతా 2 లో

## ప్రైవేట్ సంస్థ కోసం టెండర్ రూల్స్ మార్చారు

### సీబీఎస్ఈ టెండర్లలో అవినీతి జరిగింది

ఫోన్లతో ఆన్సర్ షీట్ల స్కానింగ్'.. సీబీఎస్ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ నిప్పులు!

మొబైల్ ఫోన్లతో ఆన్సర్ షీట్లను స్కాన్ చేసినట్లు వెల్లడి

పోర్టల్ హ్యాక్ చేసి లోపాలను బయటపెట్టిన ఎథికల్ హ్యాకర్

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్



ఢిల్లీ: మొబైల్ ఫోన్లతో ఆన్సర్ షీట్లను స్కాన్ చేసి దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి మిగతా 2 లో

### విశాఖలో ఫ్యూచర్ క్యాంపస్
## ఏర్పాటు చేయాలి

### విశాఖను డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

ఎయిర్‌ట్రంక్‌కు ఆహ్వానం.. విశాఖలో మరో భారీ పెట్టుబడిపై లోకేష్ ఫోకస్

ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో మంత్రి నారా లోకేష్ భేటీ

ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించిన ఎయిర్‌ట్రంక్ సంస్థ

ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సీఈఓ హామీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మిగతా 2 లో



## తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారు

- హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం.. క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!
- హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'
- హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న

హైదరాబాద్: హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన తమకు లేదు

### ఆ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎత్తేసేది లేదు

"రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం

★ అలాగైతే మేం ఎన్నికల్లో పోటీ చేయం

★ రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన కేంద్రం ఎప్పుడూ పెట్టలేదు

★ "కిషన్‌రెడ్డికి నేను ఒకటే చెప్పదలుచుకున్నా. వడ్లు కొనంది మీరు..

★ రైతు పండించిన ప్రతీ గింజను మా ప్రభుత్వం కొంటుంది



హైదరాబాద్: మోటర్లకు మీటర్లు పెట్టినా.. రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేసినా మేం ఎన్నికల్లో పోటీ చేయం.. ఒక వేళ మోటర్లకు మీటర్లు పెట్టకపోయినా.. ఉచిత విద్యుత్ కొనసాగించినా ఎన్నికల్లో పోటీ నుంచి బీఆర్ఎస్ తప్పుకుంటుందా? అంటూ ఆ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2 లో




### మే నెలలో తిరుమలకు పోటెత్తిన భక్తులు.. శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం

- మే నెలలో తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం
- వేసవి సెలవులతో భారీగా తరలివచ్చిన భక్తులు
- 25 లక్షల మందికి పైగా భక్తులకు స్వామివారి దర్శనం
- హుండీ ద్వారా రూ. 120 కోట్లకు పైగా కానుకలు
- 12 లక్షల మందికి పైగా తలనీలాలు సమర్పణ

### నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు..
## సీబీటీ పిటిషన్ తిరస్కరణ




నీట్ రీ-టెస్ట్‌ను కంప్యూటర్ విధానంలో నిర్వహించాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

జూన్ 21న ఓఎంఆర్ పద్ధతిలోనే పరీక్ష

## 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజిత్ కీలక ప్రకటన




ఢిల్లీ: సోషల్ మీడియాలో సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు (సీజేపీ) అభిజీత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. ఇటీవల విద్యావ్యవస్థలో చోటు చేసుకున్న పలు వైఫల్యాల్ని ఎత్తి చూపిస్తూ జూన్ 6న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతి చేపట్టే నిరసనలో పాల్గొనేందుకు అందరూ కలిసి కట్టుగా రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత కారణాల వల్ల విదేశాల్లో ఉన్న సీజేపీ వ్యవస్థాపకుడు జూన్ 6న ఢిల్లీకి చేరుకోనున్నారు. 'విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసేందుకు భారత్‌కు తిరిగి వస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద జరిగే ఈ శాంతియుత నిరసనలో పాల్గొని, ప్రభుత్వం నుండి జవాబుదారీతనం కోరే మన రాజ్యాంగ హక్కును వినియోగించుకోవాలని భారత యువతను నేను కోరుతున్నాను' అని వ్యాఖ్యానించారు. అయితే, అభిజీత్ దీప్కే పిలుపుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశ విద్యా వ్యవస్థలో పదేపదే తలెత్తుతున్న సమస్యలతో విసిగిపోయిన ప్రజలు, దీప్కే తిరిగి వచ్చి ముందుండి నడిపించాలనే నిర్ణయం సాహోసోపేతమని కొనియాడుతున్నారు.

## మీరు హాయిగా కూర్చుని విశ్రాంతి తీసుకోండి.. అంతా మంచే జరుగుతుంది : ట్రంప్ డెమోక్రాట్లపై ఆగ్రహం



వాషింగ్టన్ : పశ్చిమాసియాలో మారుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో ఇరాన్ నిజంగా ఒప్పందం చేసుకోవాలనుకుంటోంది అని సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవడం వల్ల.. వాషింగ్టన్‌తోపాటు దాని మిత్ర దేశాలకు కూడా మంచి జరుగుతుందని ఆయన అన్నారు. ఆయన చేసే నిర్ణయాలకు తన సొంత పార్టీలో వారు గానీ, రాజకీయ ప్రత్యర్థులు (డెమోక్రాట్లు) కానీ తనకు మద్దతు ఇవ్వకపోవడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారినుద్దేశించి 'మీరు వాదించకుండా.. హాయిగా కూర్చొని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోండి' అంటూ కామెంట్ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. కాగా, 'ఇరాన్ నిజంగా ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోంది. అది అమెరికాకు, మాతో ఉన్నవారికి మంచి ఒప్పందం అవుతుంది. అయితే ఈ సమయంలో.. డెమోక్రాట్లు కానీ, దేశభక్తి లేనివారిలా కనిపించే పలువురు రిపబ్లికన్లకు ఒక విషయం అర్థం కావడం లేదా? యుద్ధం విషయంలో నేను మరింత వేగంగా ముందుకెళ్లాలని, లేదా నెమ్మదిగా వెళ్లాలని, లేదా యుద్ధానికి వెళ్ళాలని, లేదా యుద్ధానికి వెళ్ళకూడదని, లేదా ఇంకేదైనా చేయాలి అని రాజకీయ దళారులు మునుపెన్నడూ లేని స్థాయిలో పదే పదే నాపై ప్రతికూలంగా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అలాంటప్పుడు నా పనిని సవ్యంగా చేయడం.. చర్చలు జరపడం నాకు చాలా కష్టతరం అవుతుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ట్రంప్‌ని తనని విమర్శించే వారిని దృష్టిలో పెట్టుకుని పరోక్షంగా.. 'మీరు హాయిగా కూర్చుని విశ్రాంతి తీసుకోండి, చివరికి అంతా మంచే జరుగుతుంది.. ఎప్పుడూ అలాగే జరుగుతుంది.. ఓపిక, విశ్వాసంతో ఉండాలి' ట్రంప్ తన ట్రూత్ పోస్టులో ప్రత్యర్థుల్ని కోరారు.

## రక్షణ కంపెనీలో భారీ పేలుడు : ఐదుగురు మృతి




దక్షిణ కొరియా : దక్షిణ కొరియాలోని రక్షణ కంపెనీలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. దక్షిణ కొరియాలో డేజియోన్ నగరంలో హన్వా ఏరోస్పేస్ నిర్వహిస్తున్న కంపెనీలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. అయితే అగ్నిప్రమాదం జరగడానికి గల కారణాలు వెల్లడికాలేదని అధికారులు వెల్లడించారు. అయితే ఆ ప్రాంతం ప్రభుత్వం నియమించిన భద్రతా కేంద్రమని అత్యవసర సేవల అధికారి యూన్ సియోంగ్-సు మీడియాకు వెల్లడించారు. కాగా, క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యాధికారి కిమ్ జు- యోన్ తెలిపారు. భారీ పేలుడు వల్ల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. దీంతో మృతదేహాలు ఎవరివని ఇంకా అధికారులు గుర్తించలేదని ఆమె వెల్లడించారు. హన్వా ఏరోస్పేస్ నుంచి భారీ పరిమాణంలో గల ప్రొపెల్లెంట్‌లను, ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణులను అభివృద్ధి చేస్తారని యోన్‌హాప్ వార్తా సంస్థ వెల్లడించింది.

## బెంగాల్ కేబినెట్ విస్తరణ 35 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం



కోల్‌కతా : బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి బాధ్యతలు చేపట్టిన కొన్నిరోజుల తర్వాత కేబినెట్ విస్తరణ జరిగింది. నేడు 35 మంది మంత్రులు కోల్‌కతాలోని లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కొత్త మంత్రుల చేత గవర్నర్ ఆర్.ఎన్ రవి ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో 41 మంది మంత్రులతో కూడిన కేబినెట్ ఏర్పడింది. కొత్తగా ఏర్పడిన కేబినెట్ మంత్రలుగా సోమవారం ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఎమ్మెల్యేలు దీపక్ బర్మాన్, అర్జున్ సింగ్ శంకర్ ఘోష్, గౌరి శంకర్ ఘోష్, తపాష్ రాయ్, మనోజ్ కుమార్ ఓరాన్, జగన్నాథ్ ఛటోపాధ్యాయ, అజయ్ పొద్దార్, స్వపన్ దాస్‌గుప్తా, డాక్టర్ శరద్వాత్ ముఖర్జీ, కళ్యాణ్ చక్రవర్తిలు ఉన్నారు.

## మయన్మార్ అధ్యక్షుడితో ప్రధాని సమావేశం



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన అధికారిక నివాసం హైదరాబాద్ హౌస్‌లో సోమవారం మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లేయింగ్‌ను కలిశారు. ఇరుదేశాల మధ్య శాంతి, అభివృద్ధి, శ్రేయస్సు కోసం ఇరు నేతలు తమ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చర్చలు జరపనున్నారని భారత విదేశాంగ శాఖామంత్రి ఎస్. జై శంకర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, మయన్మార్ అధ్యక్షుడు భారత్ పర్యటన ఇదే తొలిసారి. ప్రధాని ఆహ్వానం మేరకు ఆయన భారత్ పర్యటన మే 30-జూన్ 2 వరకు కొనసాగుతుంది.

# అందుకే ఆర్సీబీ సంబురాలకు బ్రేక్!



ఒకటి క్రికెట్ కప్.. మరొకటి ఫుట్‌బాల్ ట్రోఫీ. ఒకటి బెంగళూరు.. ఇంకొకటి పారిస్. క్రీడలు వేరు, దేశాలు వేరు. కానీ రెండు నగరాలు ఒకే ప్రశ్నను ఎదుర్కొన్నాయి. విజయోత్సవాలు ఎక్కడ, ఎలా ముగియాలి?. గత ఏడాది ఆర్సీబీ టైటిల్ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాట దేశాన్ని కుదిపేస్తే.. తాజాగా పీఎస్‌జీ ఛాంపియన్స్ లీగ్ విజయం తర్వాత పారిస్‌లో చెలరేగిన అల్లర్లు ప్రపంచాన్ని షాక్‌కు గురిచేశాయి. ఈ రెండు ఘటనలు కలిసి క్రీడా సంబరాలపై కొత్త హెచ్చరికగా మారాయి. యూఈఎఫ్ఏ ఛాంపియన్స్ లీగ్ ఫైనల్లో ఆర్సెనల్‌ను ఓడించి ప్యారిస్ సెయింట్ జర్మైన్ (ఫ్రా+) మరోసారి యూరప్ ఛాంపియన్‌గా నిలిచిన వెంటనే పారిస్ వీధులు అభిమానులతో కిక్కిరిశాయి. మొదట అది ఆనందోత్సవంలా కనిపించింది. ఐఫిల్ టవర్ క్లబ్ రంగులతో మెరిసింది. వేలాది మంది అభిమానులు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. కానీ కొద్ది గంటల్లోనే పరిస్థితి మారిపోయింది. కార్లకు నిప్పంటించడం, దుకాణాలపై దాడులు, పోలీసులపై రాళ్లు రువ్వడం, వీధుల్లో విధ్వంసం చోటుచేసుకున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఒకరు ప్రాణాలు కోల్పోగా.. 780 మందికిపైగా అరెస్టయ్యారు. 264కు పైగా వాహనాలు దగ్ధమయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వేలాది మంది పోలీసులను రంగంలోకి దించాల్సి వచ్చింది. క్రీడా విజయాన్ని జరుపుకునేందుకు ప్రారంభమైన రాత్రి చివరకు చట్టవ్యవస్థకు సవాలుగా మారింది. ఈ దృశ్యాలు భారత అభిమానులకు గత ఏడాది బెంగళూరులో జరిగిన విషాదాన్ని గుర్తు చేశాయి. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పుడు నగరం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది. జట్టు విజయోత్సవాలను ప్రత్యక్షంగా చూడాలని లక్షలాది మంది అభిమానులు తరలివచ్చారు. కానీ భారీ జనసందోహాన్ని పోలీసులు నియంత్రించలేకపోవడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. మరెందరో గాయపడ్డారు. క్రీడా చరిత్రలో నిలిచిపోవాల్సిన ఆనంద క్షణం విషాద అధ్యాయంగా మారిపోయింది. ఆ ఘటన కేవలం ఒక ప్రమాదంగా ముగియలేదు. క్రీడా విజయోత్సవాల నిర్వహణపై ప్రభుత్వాలు, పోలీసు శాఖలు, క్రీడా సంస్థల ఆలోచననే మార్చేసింది. అభిమానుల భావోద్వేగం ఎంత ముఖ్యమో, వారి భద్రత కూడా అంతే ముఖ్యమని అందరికీ అర్థమైంది. అందుకే.. ఈ ఏడాది ఆర్సీబీ మళ్లీ ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచినప్పటికీ, గతంలో లాగా భారీ ర్యాలీలు, నియంత్రణలేని బహిరంగ సంబరాలకు అవకాశం ఇవ్వలేదు. బెంగళూరు పోలీసులు ముందుగానే అప్రమత్తమయ్యారు. నగరంలో పెద్ద ఎత్తున గుమికూడే కార్యక్రమాలపై పరిమితులు విధించారు. భారీ జనసందోహాలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. విజయోత్సవాల కంటే భద్రతకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఆర్సీబీ యాజమాన్యం కూడా ఇదే సందేశాన్ని అభిమానులకు ఇచ్చింది. గత ఏడాది విషాదాన్ని గుర్తుచేస్తూ, వీధుల్లోకి పెద్ద ఎత్తున రావద్దని, కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనే సురక్షితంగా విజయాన్ని ఆస్వాదించాలని అభిమానులకు పిలుపునిచ్చింది. సోషల్ మీడియా వేదికగా బాధ్యతాయుతమైన సంబరాలు జరుపుకోవాలని సూచించింది. సాధారణంగా జట్లు అభిమానులను బయటకు రమ్మని పిలుస్తాయి. కానీ ఈసారి అభిమానులు సురక్షితంగా ఉండటమే పెద్ద సంబరమని ఆర్సీబీ భావించడం గమనార్హం. వాస్తవానికి పారిస్ ఘటన, బెంగళూరు తొక్కిసలాట రెండూ ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి. క్రీడా విజయాలు ప్రజలను ఏకం చేయగలవు. కానీ అదే భావోద్వేగం అదుపు తప్పితే ప్రమాదకరంగా మారుతుంది. సంబరాలు అల్లర్లకు దారి తీసినా, జనసందోహం ప్రాణాలను బలిగొన్నా చివరకు నష్టపోయేది అభిమానులే. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా క్రీడా నిర్వాహకులు ఒక కొత్త వాస్తవాన్ని అంగీకరిస్తున్నారు. విజయం ఎంత గొప్పదైనా, భద్రత దానికంటే గొప్పది. బెంగళూరు తొక్కిసలాట నేర్పిన పాఠాన్ని పారిస్ అల్లర్లు మరోసారి గుర్తు చేశాయి. కప్‌లు ప్రతి ఏడాది ఎవరో ఒకరు గెలుస్తారు. కానీ ఒక్క ప్రాణం కూడా పోకూడదనే బాధ్యత మాత్రం అందరిదీ. అందుకే ఈసారి ఆర్సీబీ సంబరాలకు బ్రేక్ పడింది. అది ఆనందంపై ఆంక్ష కాదు... గత విషాదం మళ్లీ పునరావృతం కాకూడదన్న ముందస్తు జాగ్రత్త.

# ఆ పాట లతాజీది కాదండీ.. నాదే!



ఆ స్వరం వినిపిస్తే చాలు... చెవుల్లో తేనె పోసినట్లు, మనసు ఎక్కడో మెల్లగా తేలిపోతున్న అనుభూతి కలిగేది. రేడియోలో అలనాటి పాటలు మోగుతుంటే చాలామంది "ఆహా.. ఎంతైనా లతా మంగేష్కర్ గారే కదా... ఆ గాత్రం అంత మధురంగా ఉంటుందో!" అని మురిసిపోయేవారు. కానీ ఆ మాధుర్యానికి మూలం ప్రతిసారి లతా మంగేష్కర్ స్వరం మాత్రమే కాదు. ఆ కాలంలో అంతే మృదువుగా, అంతే హృద్యంగా శ్రోతలను ఆకట్టుకున్న మరో గొంతు సుమన్ కళ్యాణ్‌పూర్‌ది కూడా. వినేవారిని గందరగోళంలో పడేసేంత సమానతతో, ఆమె గాత్రం లతా గాత్రానికి ఏమాత్రం తగ్గకుండా అదే మాధుర్యాన్ని, అదే భావాన్ని మనసులో నిలిపేది. అలనాటి మధుర గాన గంధర్వి, ప్రముఖ నేపథ్య గాయని సుమన్ కళ్యాణ్‌పూర్ 89 ఏళ్ల వయసులో కన్నుమూశారు. వయోభారంతో ముంబైలోని తన నివాసంలో ఆమె ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఆమె మరణంతో భారతీయ సినీ సంగీత స్వర్ణయుగానికి చెందిన మరో గొప్ప స్వరం మూగబోయింది. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఆమెకు నివాళు లర్పిస్తున్నారు. 1937 జనవరి 28న అప్పటి బ్రిటీష్ భారతదేశంలోని ఢాకాలో (ప్రస్తుత బంగ్లాదేశ్) సుమన్ హెమ్మాడిగా జన్మించిన ఆమె చిన్నతనంలోనే కుటుంబంతో కలిసి ముంబైకి వచ్చారు. సంగీతం, చిత్రలేఖనం రెండింటిపైనా ఆసక్తి ఉన్న ఆమె ముంబైలోని ప్రముఖ సర్ జే.జే. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుకున్నారు. అయితే అభిరుచిగా ప్రారంభమైన సంగీత ప్రయాణమే తర్వాత ఆమె జీవితాన్ని మలిచింది. హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకుని 1950లలో సినీ గాన రంగంలో అడుగుపెట్టారు. 1960, 70 దశకాల్లో ఆమె స్వరం దేశవ్యాప్తంగా మార్మోగింది. "నా తుమ్ హమే జానో", "ఆజ్‌కల్ తేరే మేరే ప్యార్ కే చర్చే", "తుమ్నే పుకారా ఔర్ హమ్ చలే ఆయే", "నా నా కర్తే ప్యార్", "దిల్ ఏక్ మందిర్ హై" వంటి పాటలు సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా వీశీష్ట్రుఎవివస ఝటఅతో కలిసి పాడిన యుగళగీతాలు అపార ప్రజాదరణ పొందాయి.

### రఫీ కాంబోలోనే..

సుమన్ కళ్యాణ్‌పూర్ కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఆమె స్వరం లతా మంగేష్కర్ స్వరానికి చాలా దగ్గరగా ఉండటం. దీంతో ఆమె పాడిన అనేక పాటలను శ్రోతలు లతా పాటలుగానే భావించేవారు. ఒకసారి తన పాటలను కూడా లతాజీ పాటలుగా గుర్తిస్తున్నారని చెప్పినప్పుడు, సుమన్ నవ్వుతూ "బాబోయ్.. ఆ గొంతు నాదేనండీ.. లతాజీది కాదు!" అంటూ సరదాగా స్పందించిన సంఘటన సంగీత వర్గాల్లో ఇప్పటికీ గుర్తుంటుంది. అదే కాలంలో హిందీ సినీ పరిశ్రమలో రఫీ--లతా మధ్య పాటల రాయల్టీ, క్రెడిట్ అంశాలపై వచ్చిన చిన్న ప్రొఫెషనల్ విభేదాల కారణంగా కొన్ని ప్రాజెక్టుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో ఏర్పడిన ఆ గ్యాప్ నేపథ్యంలోనే సుమన్ కళ్యాణ్‌పూర్ వంటి గాయనిలకు కూడా అవకాశాలు లభించాయి. అలా లతా పాడని కొన్ని పాటల్లో సుమన్ స్వరం వినిపించింది.

### లతాజీ ఏమనే వారంటే..

అయితే ఈ పోలికను ఆమె ఎప్పుడూ ప్రతికూలంగా తీసుకోలేదు. "నా స్వరం లతాజీ స్వరాన్ని పోలి ఉండొచ్చు. కానీ సంగీత పరిజ్ఞానం ఉన్నవారు రెండింటి మధ్య తేడాను గుర్తిస్తారు" అని ఒక ఇంటర్వ్యూలో చెప్పింది. లతా మంగేష్కర్‌పై తనకు ఎంతో గౌరవం ఉందని, ఆమెను సన్నిహిత స్నేహితురాలిగానే భావించేదాన్నని కూడా సుమన్ చెప్పింది. ఇక.. లతా మంగేష్కర్ కూడా సుమన్ కళ్యాణ్‌పూర్ గురించి పలు ఇంటర్వ్యూలలో గౌరవంగానే మాట్లాడేవారు. "సుమన్‌కు చాలా మంచి స్వరం ఉంది. ఆమె గొంతు మధురంగా ఉంటుంది. మా ఇద్దరి స్వరాలు ఒకేలా అనిపించడంతో ప్రేక్షకులు కొన్నిసార్లు గందరగోళానికి గురయ్యేవారు. ప్రతి గాయకురాలికి తనకంటూ ఒక ప్రత్యేకత ఉంటుంది" అంటూ లతాజీ పలు ఇంటర్వ్యూల్లో మాట్లాడారు.

### పద్మభూషణ్..

1958లో వ్యాపారవేత్త రమానంద్ కళ్యాణ్‌పూర్‌ను వివాహం చేసుకున్న తర్వాత ఆమె పేరు సుమన్ హెమ్మాడి నుంచి సుమన్ కళ్యాణ్‌పూర్‌గా మారింది. ఆమె భర్త ప్రతి రికార్డింగ్‌కు వెంట ఉండేవారని కుటుంబ సభ్యులు చెబుతుంటారు. గ్లామర్‌కు, ప్రచారానికి దూరంగా సాధారణ జీవితాన్ని గడపడం ఆమె ప్రత్యేకత.

హిందీతో పాటు మరాఠీ, బెంగాలీ, కన్నడ, అస్సామీ, ఒడియా, గుజరాతీ, భోజ్‌పురి సహా అనేక భాషల్లో ఆమె పాటలు పాడారు. దాదాపు 700కు పైగా పాటలతో సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆమె గాన సేవలకు గుర్తింపుగా మహారాష్ట్ర ప్రభుత్వం లతా మంగేష్కర్ అవార్డు ప్రదానం చేయగా, 2023లో భారత ప్రభుత్వం పద్మ భూషణ్‌తో సత్కరించింది. అయితే సంగీత విమర్శకులు, పరిశీలకులు తరచూ ఒక విషయాన్ని ప్రస్తావిస్తుంటారు---సుమన్ కళ్యాణ్‌పూర్‌కు తన ప్రతిభకు తగినంత గుర్తింపు, ప్రధాన స్థాయి ప్రచారం పూర్తిగా దక్కలేదని. ఆమె స్వరం లతా మంగేష్కర్ స్వరంతో పోలికకు గురవడంతో, అనేక సందర్భాల్లో ఆమె ప్రత్యేకత నీడలో పడిపోయిందని వారు చెబుతుంటారు. అనేక మంది అభిప్రాయం ప్రకారం, అదే స్వర్ణయుగంలో ఉన్నప్పటికీ సుమన్‌కు రావాల్సిన స్థాయి గౌరవం, స్టార్‌డమ్ పూర్తిగా అందలేదన్న భావన సంగీత ప్రపంచంలో ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. ఆమె మరణంతో ఒక స్వరం ఆగిపోయి ఉండొచ్చు. కానీ "ఆజ్‌కల్ తేరే మేరే ప్యార్ కే చర్చే" వినిపించే ప్రతిసారీ, "నా తుమ్ హమే జానో" మళ్లీ మళ్లీ హృదయాల్లో మోగే ప్రతిసారీ సుమన్ కళ్యాణ్‌పూర్ అనే మధుర జ్ఞాపకం సంగీత ప్రేమికుల మధ్య చిరకాలం జీవిస్తూనే ఉంటుంది.

# కాలాతీత బాల్యం



'టామ్.' జవాబు లేదు. 'ఒరేయ్ టామ్.' పోలీ పెద్దమ్మ పిలుపునకు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా ఓ అని వినబడుతుంది. టామ్ అమెరికాలో మాత్రమే లేడుగా! వాడు ఆఫ్రికాలోనూ ఉన్నాడు, అనకాపల్లిలోనూ ఉంటాడు. అల్లరి, సాహసం కలగలిసిన ప్రతి పిల్లాడూ టామే! 1876 జూన్ 9న 'పుట్టిన' టామ్ సాయర్‌కు ఇప్పుడు 150 ఏళ్లు! కానీ ఆ తుంటరికి వయసనేది అయిపోతుందా? టామ్ సదాబాలుడు, సరదా బాలుడు; పోలీ పెద్దమ్మనే కాదు, సకల ప్రపంచాన్ని తన అల్లరి చేష్టలతో ఏలిన కౌబాలుడు. 'ది అడ్వెంచర్స్ ఆఫ్ టామ్ సాయర్' నవలను మార్క్ ట్వెయిన్ కేవలం పిల్లల కోసమే రాయలేదు. 'పెద్దవాళ్లు తమ చిన్నతనంలో తాము ఎలా ఉండేవారో, తమ ఆలోచనలు ఎలా ఉండేవో, తాము ఎలా మాట్లాడేవారో, చిత్రమైన సన్నివేశాల్లో ఎలా చిక్కుకునేవారో ఆహ్లాదకరంగా వారికి జ్ఞాపకం' చేసిందా నవల. ప్రపంచ సాహిత్య యవనికపై ఒక చిలిపి బాలుడి సాహసాలు ఇంతటి సుదీర్ఘ కాలం సజీవంగా ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇంటి గోడకు సున్నం వేయడాన్ని కూడా ఒక కళగా మార్చి, ఇతరులతో పని చేయించుకునే తెలివితేటలున్న టామ్ నేటి మేనేజ్‌మెంట్ గురువులకు ఆది గురువు. ఈ నవల రాకముందు, అమెరికన్ సాహిత్యం ఎక్కువగా యూరోపియన్ శైలిని అనుకరిస్తూ, నీతి సూత్రాలతో నిండి ఉండేది. కానీ ట్వెయిన్ అమెరికన్ మాండలికాన్ని, సామాన్యుల భాషను సాహిత్య గౌరవ పీఠంపై కూర్చో బెట్టాడు. 'ఆధునిక అమెరికన్ సాహిత్యం అంతా మార్క్ ట్వెయిన్ రాసిన ఒకే ఒక్క పుస్తకం నుండి పుట్టింది' అని 'ది అడ్వెంచర్స్ ఆఫ్ హకల్‌బెరీ ఫిన్' (1884) నవలను కొనియాడాడు ఎర్నెస్ట్ హెమింగ్వే. ఈ నవల టామ్ సాయర్‌కు పొడిగింపు అన్నది గుర్తుంచుకుంటే దాని బీజాలు మొదటే ఉన్నాయన్నది అర్థమవుతుంది. కొన్ని కథలు రాసినా ట్వెయిన్‌కు ఇది తొలి నవల. మిసిసిపీ నది తీరాన ఉన్న హానిబాల్ గ్రామంలో గడిపిన తన సొంత బాల్య స్మృతుల నుంచే ట్వెయిన్ ఈ కథను అల్లుకున్నాడు. తనకు తెలిసిన ముగ్గురు అల్లరి పిల్లల లక్షణాలను కలిపి 'టామ్'ను సృష్టించాడంటారు. పేరును మాత్రం లోకల్ హీరో అయిన ఒక ఫైర్‌ఫైటర్ మీదుగా స్వీకరించాడు. ట్వెయిన్‌కు అతడు స్నేహితుడు కూడా. ఇద్దరూ కలిసి సాయంత్రాలు షికార్లు కొట్టేవాళ్లు. అందరికీ ఇష్టమైన హకల్‌బెరీ ఫిన్ పాత్రనేమో తన బాల్యమిత్రుడు టామ్ బ్లాంకెరీ షిప్ ఆధారంగా రూపొందించాడు. ట్వెయిన్ చుట్టూ ఎందరు టాములో! సిడ్ సాయర్, బెకీ థాచర్, జడ్జ్ థాచర్, జో హార్పర్, విడో డగ్లస్, ఇంజన్ జో లాంటి పాత్రలు కూడా మరిచిపోలేనివి. సినిమాలుగా, టీవీ ప్రోగ్రాములుగా, మ్యూజి కల్సుగా అలరించిన టామ్ సాయర్, టైప్‌రైటర్ మీద రాసిన తొలి నవల అని ప్రచారంలో ఉంది. కానీ అది నిజానికి 'లైఫ్ ఆన్ ద మిసిసిపీ' (1883) అని మరోమాట! ◘

ఇదీ మార్క్ ట్వెయిన్‌దే కావడం గమనార్హం. పిల్లలు కేవలం మంచివాళ్లు లేదా చెడ్డవాళ్లు కాదు; వాళ్లు అల్లరి, భయం,సాహసం కలగలిసిన వాళ్లని ప్రపంచానికి చాటి చెప్పాడు ట్వెయిన్. ప్రకృతితో మమేకమవ్వడం, అన్వేషించడం నేటి పిల్లలు కోల్పోతున్న సహజ లక్షణాలు. చీకటి గుహల్లో నిధుల కోసం వెతికిన టామ్ మనకు ఇదే గుర్తు చేస్తాడు. నేటి డిజిటల్ యుగంలో, స్మార్ట్‌ఫోన్లకు బందీలైపోతున్న బాల్యానికి టామ్ సాయర్ ఒక తాళంచెవి. వందల ఏళ్లు గడిచినా, సమాజం ఎంత ఆధునీకరించబడినా మనుషుల్లోని అమాయ కత్వం, సాహస ప్రవృత్తి మారవు. అందుకే 'టామ్ సాయర్' కేవలం ఒక పుస్తకం కాదు, అది ప్రతి ఒక్కరి లోపల దాగి ఉన్న బాల్యానికి నిలువుటద్దం. ఈ 150వ వేడుకల సందర్భంగా మనలోని ఆ చిలిపి టామ్ సాయర్‌ను ఒకసారి నిద్రలేపుదాం! ఈ నవలను నండూరి రామమోహనరావు (1927--2011) టామ్ మన పక్కింటి పిల్లాడే అన్నంత హాయిగా తెలుగులోకి అనువదించాడు. రచయిత నామిని తన కొడుక్కు టామ్ సాయర్ అని పేరు పెట్టుకున్నాడు. టామ్ ఎంతటి తెలుగువాడో చెప్పడానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు. ఈ తిరుపతి టామ్ రచయితగా మారడం ఆ టామ్‌ను కన్నమార్క్ ట్వెయిన్‌కు తగిన నివాళి.

## గడిసింగాపూర్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

### - పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి మండలంలోని గడిసింగాపూర్ గ్రామంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో నిర్మాణంలో ఉన్న అండర్ డ్రైనేజ్ , సీసీ రోడ్డు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల కాంపౌండ్ వాల్‌ను ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల పార్టీ అధ్యక్షుడు వెంకట రాములు, గడిసింగాపురం స్థానిక సర్పంచ్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాదల పంచాయతి అభివృద్ధికి ప్రత్యేక అధికారులను నియమించాలి ఎంపీడీవోను కలిసిన మాదల పంచాయితీ ప్రజా సంఘ నాయకులు

అరకులోయ జూన్ 1: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలిమండలం మాదల గ్రామపంచాయతీకి చెందిన ప్రజా సంఘ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ అభివృద్ధి కొరకు కేటాయించాలని సోమవారం అరకు వేలి మండలం మండల ఎంపీడీవో మరియు మాదల పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎన్నికైన ప్రసాద్ ను కలిసీ మాదల పంచాయతీ సమస్య వివరించడమైనది, సమస్య కచ్చితంగా పరిష్కరించుటకు మనమందరం కూడా ముందుకు వెళ్దామని సానుకూలంగా స్పందించిన మండల ఎంపీడీవో మెమోరండం అందిస్తున్న పంచాయతీ వివిధ గ్రామ నాయకులు ఈ కార్యక్రమానికి గిరిజన సంఘ నాయకులు కుమిడి రమేష్ పెసాకమిటీ నాయకులు సిరిగాం గురుమూర్తి పంచాయతీ నాయకులు సోమేలి సన్యాసి, గూబయి,ఆనందరావు, జర్ర మద్దు, సోమేశ్రావు పాల్గొన్నారు

## ఆమదాలవలస మున్సిపాలిటీలో 12వ వార్డు లక్ష్మీ నగర్ వీధిలో ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ పేద ప్రజలకు ఎల్లవేళలు అండగా కూటమి ప్రభుత్వం

### ఎన్టీఆర్ భరోసా పథకం ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆముదలవలస కే అప్పారావు జూన్ 1.: ఆముదాలవలస నియోజకవర్గం లో ఆమదాలవలస పట్టణంలో 12వ వార్డు లక్ష్మీ నగర్ వీధిలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఇంటింటికీ పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఈ రోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు ఇంటి వద్దకే వెళ్ళి అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని, అర్హులందరికీ న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు, విడో మహిళలకి అనేక వర్గాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అన్ని వేలలు అండగా ఉంటుందని, ఎవరు నిరాశ చెందవద్దని ఎమ్మెల్యే రవికుమార్ హామీ ఇచ్చారు కూటమి ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుండే వృద్ధులుకి 4000, వికలాంగులకు 6000, శాశ్వత వికలాంగులకు 15000 రూపాయలు ఇస్తున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సంపద రావు మురళి మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత సాగర్ , బోయిన సునీత ,స్థానిక కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వార్డు లో పెన్షన్ అందుకున్న వృద్ధులు, మహిళలు ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వానికి ,గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలిపారు.

## బీఆర్ఎస్ బూత్ కమిటీల విస్తృత స్థాయి సమావేశం

### ఘట్కేసర్ సర్కిల్ బీఆర్ఎస్ శ్రేణుల సమరశంఖం

మేడ్చల్ జూన్ 01 : మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం అన్నోజీగూడలోని తులిప్స్ గ్రాండ్‌లో ఉమ్మడి ఘట్కేసర్ మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి,మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి హాజరై బీఆర్ఎస్ పార్టీ బలోపేతం,బూత్ స్థాయి కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలు మరియు రాబోయే రాజకీయ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు.పార్టీ విజయానికి బూత్ కమిటీ సభ్యులే వెన్నెముకగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోచారం మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, కౌడే పోచయ్య, శ్యామల శ్రీనివాస్, ఆకుల మధుకర్, సురేందర్రెడ్డి, నల్లవెల్లి శేఖర్, రమేష్, పన్నాల కొండల్ రెడ్డి, మాధవరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సామల సందీప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ మెంబెర్స్ తదితరులు కలిసి పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట మండలం, గౌరాయిపల్లి గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్

యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 1: ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఎర్రవెల్లి మహాదేవులు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థులను అడిగి తెలుసుకొన్నారుఇటీవల ఎర్రవెల్లి రామచంద్రం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు

## సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ప్రారంభంతో........

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త శకం ఆరంభం........

### టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి.........

కంకిపాడు - జూన్ 01:- భారతీయ రైల్వే చరిత్రలో ముఖమైన మైలురాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మేలి ముందడుగు..18వ రైల్వే జోన్‌గా నేడు విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభించబడిన సౌత్ కోస్ట్ రైల్వే అని కంకిపాడు మండల టీడీపీ సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోని వాల్టేరు, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లను కలిపి ఏర్పాటు చేసిన నూతన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోని పోర్టుల ద్వారా ఎగుమతులు, దిగుమతులు ఊపందుకొని, లాజిస్టిక్స్ రంగం వృద్ధి చెందడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని విశ్లేషించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ కంపెనీలు ఒప్పందాలు చేసుకొని పనులు ప్రారంభించడంతో, కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో అదనపు రైలు సర్వీసులు ఏర్పాటు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకం కానుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు నాయకత్వ ప్రతిభకు, సుదీర్ఘ రాజకీయ అనుభవానికి కొత్త రైల్వే జోన్ ఏర్పాటు కలికితురాయి అని కితాబిచ్చారు.

## బోడుప్పల్‌లో రూ.32 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు షురూ

### రంగంలోకి మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

మేడ్చల్ జూన్ 01 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లో అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు,డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సేవలు అందించేందుకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. సోమవారం బోడుప్పల్ బచ్పన్ స్కూల్ మేడిప్లస్ నుండి అమృత బార్ వద్ద ఉన్న మెడిప్లస్ వరకు నూతనంగా వేయనున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ గత పాలకుల వైఫల్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే త్వరితగతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని అందులో భాగంగానే రూ.32 లక్షల నిధులతో పనులు ప్రారంభం అవుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి,బొమ్మక కళ్యాణ్ కుమార్, కొత్త దుర్గమ్మ,చీరాల నరసింహ,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి,సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు



తుని, మహి న్యూస్, జూన్ 01: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా వైసీపీ కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతోందని సీఎం అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనల్ని ప్రస్తావిస్తూ వైసీపీ నేతల డ్రామాలను ఎండగట్టారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా వేదిక సభకు హాజరై ప్రసంగించిన సీఎం వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రజల ముందు ఉంచారు. ఆ పార్టీ నేతలు ఫ్రస్ట్రేషన్ తో ప్రతీ అంశాన్నీ వివాదం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్నాం. వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని హత్యచేసి తొలుత గుండెపోటు అన్నారు. గొడ్డలితో నరికి చంపి డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అని మోసం చేసి కోడికత్తి, గులకరాయి నాటకాలు వేశారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్ని ప్రజలు తెలుసుకోవాలి. పాలన వైకుంఠపాళి కాకూడదన్నదే మా విజ్ఞప్తి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే 241 కోర్టు కేసులు పరిష్కరించాకే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఎగ్గొట్టారు. మేం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిగింది. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నాపత్రాలతో ఎక్కడా అక్రమాలు జరగకుండా భర్తీ ప్రక్రియ నిర్వహించాం. ఫ్రస్టేషన్ లో ఉన్న వైసీపీ దీనిని కూడా వివాదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని ఆలోచన చేసింది. సమాజంలో అశాంతిని రేపాలని ప్రయత్నాలు జరిగాయి. జాగ్రత్తగా ఉండబట్టే గట్టిగా సమాధానం ఇవ్వగలిగాం. పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లోకి విసిరేసి పోయారు. కడపకు చెందిన ఓ పాస్టర్ ను పంపి హత్యాయత్నం అంటూ డ్రామాలు ఆడారు. దానిని మా పార్టీ పై నెట్టేందుకు ప్రయత్నించారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాకు అంటగట్టాలని ప్రయత్నాలు జరిగాయి. సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రలను బట్టబయలు చేయగలిగాం. తిరుమలలోని కౌస్తుభం గెస్ట్ హౌస్ దగ్గర సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లను పారేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నం చేశారు. సాక్షాత్తూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నం చేసిన



వారిని ఏమనాలి. వారిది వేరే మతం కావొచ్చు. దానికి మేం తప్పు పట్టటం లేదు. కానీ కుట్రలతో హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్రం చేసే కుట్రలు సరికాదని హెచ్చరిస్తున్నాను. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. వైసీపీ వాళ్లే ధ్వంసం చేశారు కాబట్టే సాక్షి పత్రికలో ఆ వార్తే రాయలేదు. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. రాజకీయ పార్టీగా ఈ తప్పిదాలు సరిచేసుకోకుండా ఎదురుదాడి చేస్తున్నారు. కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నవారి ఆటలు సాగనీయం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

### రెండేళ్ల క్రితం విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి

"విధ్వంసం నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా జూన్ 4 తేదీ చరిత్రలో నిలిచిపోతుంది. గత పాలన అంతా విధ్వంసకర పాలన, బహిరంగంగా నవ్వాలని అనుకున్నా ప్రజలంతా భయపడే పరిస్థితి. ప్రజలు వెళ్లి పోకుండా కందకాలు తవ్వి, ఫెన్సింగ్ లు వేసి మరీ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. దానికి నిదర్శనం పింఛన్ల పెంపు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు ఉన్నా...పెన్షన్లు ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4 వేలు చేశాం. దివ్యాంగులకు రూ.6,000 చేశాం. హెల్త్ పెన్షన్లు రూ.10 వేలకు, రూ.15 వేలకు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించాం. ఏడాదికి దాదాపు రూ.32 వేల కోట్లు ఈ ఒక్క పథకానికే ఖర్చు పెడుతున్నాం. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో, ఇంత ఎక్కువ మందికి పింఛన్లు ఇవ్వడం లేదు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం ఉంటుంది తప్ప ప్రజలను కలిసి వారి కష్ట సుఖాలు తెలుసుకునే పరిస్థితి ఉండదు. అందుకే ప్రతీ నెలా 1 తేదీన ప్రజలను నేరుగా కలుసుకుని పెన్షన్లు అందిస్తున్నాం. రాష్ట్రంలో 62.34 లక్షల మందికి, రూ.2,729 కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నాం. ఈనెల కొత్తగా మరో 5,606 మందికి రూ.2.24 కోట్లు స్పౌజ్ పెన్షన్ల కోసం మంజూరు చేశాం రాష్ట్రంలో చాలా మంది పేద కుటుంబాలకు 2-4 సంక్షేమ పథకాలు అందుతున్నాయి. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్ సేవలో, మత్స్యకారుల సేవలో ఇలా వేర్వేరు పథకాలు వస్తున్నాయి. ఈ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించేలా చర్యలు చేపట్టాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు కూడా మన యువతకు వస్తాయి. మన రాష్ట్ర యువత ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా పరిశ్రమలు తెస్తున్నాం. కాకినాడ సమీపంలో గ్రీన్ అమ్మోనియో పరిశ్రమను రూ.80 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. తుని పక్కనే అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ ఓ స్టీల్ సిటీని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నాం. పీఎం సేతు కింద యువతకు స్కిల్ డెవలప్మెంట్ చేస్తున్నాం. ఏడాదికి 25 వేల మంది యువతకు శిక్షణను పీఎం సేతు కింద ఇస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ కేంద్ర సహకారంతో తిరిగి పునరుద్ధరించాం. అలాగే విశాఖ రైల్వే జోన్ కల కూడా సాకారమైంది." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఏపీ

"పేదలకు విద్య, వైద్యంలో అత్యంత నాణ్యమైన సేవలు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్య కోసం పాఠశాలల్లో సంస్కరణలు తీసుకువచ్చాం. పాఠ్యాంశాలు మారుతున్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులు చేయకుండా యూనివర్సల్ హెల్త్ పాలసీ కూడా తీసుకువస్తున్నాం. సంజీవని పేరిట వ్యక్తిగత ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించి పర్యవేక్షిస్తాం. మెరుగైన జీవితాన్ని ప్రజలకు అందించేలా ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో సంజీవని అమలు చేస్తాం. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేలా ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది కూడా జూన్ లో యోగాంధ్ర కార్యక్రమాన్ని కూడా అమరావతిలో నిర్వహిస్తున్నాం.14 రోజుల పాటు నిర్వహించే యోగాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిస్తున్నాను. వ్యాయామం, యోగా, మెడిటేషన్ లాంటివి చేస్తే మన ఆరోగ్యాన్ని మనమే పరిరక్షించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శవంతమై రాష్ట్రంగా తీర్చిదిద్దేలా 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించాం. ప్రజలకు అందించే ప్రతీ పౌర సేవా సక్రమంగా, నాణ్యంగా అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి వరకూ విశాఖ రీజియన్ గా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ అమరావతి రీజియన్ గా తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్ ను అభివృద్ధి చేస్తున్నాం. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై పడింది. ఈసారి ఎల్ నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. దీనికి మనం అంతా సన్నద్ధం కావాలి. సమర్థ నీటి నిర్వహణతో ముందుగానే కాలువలకు నీళ్లు ఇవ్వగలిగాం. 2027 గోదావరి పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది జూలై లోగా పోలవరం ఎడమ కాలువ పూర్తి చేసి విశాఖ వరకూ నీరు తీసుకెళ్తాం. మత్స్యకార మహిళలకు సీవీడ్ ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. మన మత్స్యకారులకు రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లు సబ్సిడీపై అందిస్తాం. అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తాం. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

### ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4

కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తిగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని సీఎం సూచించారు. పేదల సేవలో కార్యక్రమంలో పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులు బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు. పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని అన్నారు. బంగారు కుటుంబాల్లో విద్యార్థులుగా, ఆదాయం ఆర్జించే వ్యక్తులుగా మారాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వివరించారు. అనంతరం సభావేదిక వద్ద తన అభిమాని అయిన దివ్యాంగ యువకుడిని ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. అతని భుజంపై చేయి వేసి ఫోటో దిగారు. ప్రభుత్వం తరపున ఆ దివ్యాంగ యువకుడికి సహకారం అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ను సీఎం ఆదేశించారు. ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటల సాగు మైక్రో న్యూట్రియంట్స్ తో పాటు ప్రకృతి సేద్యం దిశగా కృషి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

# దళితులు, గిరిజనుల భూముల జోలికి వస్తే సహించం

- చిట్టెంపల్లి భూ వివాదంలో పోలీసుల జోక్యంపై విచారణ జరపాలి
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి నియోజకవర్గంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, భూ ఆక్రమణ ప్రయత్నాలు, కుల వివక్ష, అధికార పార్టీ నాయకులు కొందరు పోలీసు అధికారుల అండదండలతో పెరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కెవిపిఎస్, ఎస్సీ-ఎస్టీ-బీసీ-మైనార్టీ హక్కుల పరిరక్షణ సంఘం, గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. ఈ ఘటనలపై వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేడు పరిగిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కోశాధికారి బుస్సా చంద్రయ్య, నాయకులు కొత్తూరు చంద్రయ్య మాట్లాడుతూ దళితులు, గిరిజనులు చట్టబద్ధంగా కొనుగోలు చేసుకున్న భూములను కొందరు అగ్రకుల భూస్వాములు, రాజకీయ అండదండలతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వికారాబాద్‌కు చెందిన గిరిజన యువకుడు ఆంగోత్ గణేష్ పూడూరు మండలం అంగడి చిట్టెంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 100లో భూమి కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అదే సర్వే నంబర్‌లో మరో బాధితుడు విజయరాజు కూడా భూమి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. తేది 22-04-2026న చిట్టెంపల్లి గ్రామానికి చెందిన కలిమొద్దీన్, జమీర్, హబీబ్లు అక్రమంగా పొలంలోకి ప్రవేశించి గిరిజన యువకుడిని కులం పేరుతో దూషించి, పంటను ధ్వంసం చేసి, భూమి తమదేనంటూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు చన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో నేషనల్ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారని, కమిషన్ ఆదేశాల మేరకు 01-05-2026న ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు అయ్యిందని తెలిపారు. అయితే కేసు నమోదైనప్పటి నుండి నిందితులను అరెస్టు చేయకుండా బాధితులనే రాజీకి ఒత్తిడి చేయడం, భూములను అమ్మాలని హెచ్చరించడం, సమస్య నుంచి తప్పుకోవాలని సూచించడం జరుగుతోందని ఆరోపించారు. చన్‌గోముల్ ఎస్సై భరత్ రెడ్డి అనేకసార్లు బాధితులు ఆంగోత్ గణేష్, విజయరాజులను పిలిపించి భూములు అమ్మేయాలని, లేకుంటే మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండి బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత కలిగి ఉంటారని, కానీ నిందితుల పక్షాన జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. చిట్టెంపల్లి భూ వివాదంలో , పోలీసుల వ్యవహారశైలిపై జిల్లా యంత్రాంగం, ఉన్నత పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనుల భూముల విషయంలో రాజకీయ జోక్యం, పోలీసు ఒత్తిళ్లు సహించబోమని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం ప్రకారం కులం పేరుతో దూషించడం, భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించడం, బాధితులను బెదిరించడం, రాజీకి ఒత్తిడి చేయడం, కేసులను ప్రభావితం చేయడం వంటి చర్యలు శిక్షార్హమైన నేరాలని గుర్తు చేశారు. బాధితులకు రక్షణ కల్పించడం, నిందితులపై వేగంగా చర్యలు తీసుకోవడం పోలీసుల చట్టబద్ధ బాధ్యత అని పేర్కొన్నారు. ఐయినాపూర్ గ్రామానికి చెందిన రాములు తన ఇంటికి వెళ్లకుండా అడ్డుకున్న వ్యక్తిపై, దౌల్తాబాద్ మండలం గోకపస్లాద్ గ్రామానికి చెందిన దళిత మహిళ వెంకటమ్మ భూమి వివాదంలో వేధింపులకు పాల్పడిన వ్యక్తులపై కూడా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి అన్ని కేసుల్లో నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కెవిపిఎస్, గిరిజన సంఘం, దళిత సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడి, ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ నాయకులు సత్యయ్య, గిరిజన సంఘం నాయకులు రమేష్, బాధితులు ఆంగోత్ గణేష్, విజయరాజు, రమేష్, సాయిబన్న, నర్సింలు, వెంకటమ్మ, హనుమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## యోగా దినోత్సవ వేదిక ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



గుంటూరు, మహి న్యూస్, జూన్ 1 : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేదిక ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమం అమరావతి వేదికగా నిర్వహించే అవకాశాలు ఉన్నందున ముందుగా స్థల పరిశీలన చేశారు. సీడ్ యాక్సెస్ రోడ్ పై ఎంత మందితో యోగ నిర్వహించవచ్చు, ఎటువంటి వసతి సౌకర్యాలు కల్పించాలి, పార్కింగ్ వంటి అంశాలను కూడా పరిశీలించారు. జూన్ 7వ తేదీ నుండి ఒక్కో శీర్షికన (థీమ్) యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రదేశాల చారిత్రక నేపథ్యంలో ప్రాచుర్యం కల్పించుటకు ఆయా ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. జూన్ 7వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని అన్నారు. గత ఏడాది వలెనే ఈ ఏడాది కూడా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యోగా సంస్థలు, యోగా శిక్షకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తహసిల్దార్ దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారం లో ప్రజల సంతృప్తే ప్రధాన లక్ష్యం...



### జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

గుంటూరు, మహి న్యూస్, జూన్ 1: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో మానవత్వంతో వ్యవహరించాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సూచించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, డిప్యూటీ కలెక్టర్ డేవిడ్ అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి అంతిమ లక్ష్యంగా దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ఎక్కువ రోజులు పెండింగ్ లో ఉంచకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చూపకుండానే అర్జీలను మూసివేసే అధికారులపై చర్యలు తప్పవన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల వద్దకు ఎప్పటివలెనే జిల్లా కలెక్టర్ నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 453 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 184, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 159 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 5 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 22 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 64, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 7 అర్జీలు అందాయి.

### దివ్యాంగులకు వీల్ చైర్ లు పంపిణీ

చేతన ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వీల్ చైర్ లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. దివ్యాంగులను ఎంపిక చేసి వీల్ చైర్ లను పంపిణీ చేసిన చేతన ఫౌండేషన్ కు జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఎ.పిఎం.ఐ.పి ఎల్. వజ్రశ్రీ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కళాశాల విద్యార్థినుల ఘన విజయం..

### 70 ర్యాంకులు కైవసం



శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 1: స్థానిక ప్రభుత్వ మహిళా (స్వయంప్రతిపత్తి) కళాశాల విద్యార్థినులు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించిన పీజీ సెట్ లో 47 ర్యాంకులు, ఎడ్ సెట్ లో 18, ఏపీ ఐసిఈటి లో 3, సీయూఈటీ (పీజీ) లో రెండు చొప్పున మొత్తం 70 ర్యాంకులను మహిళా కళాశాల విద్యార్థినులు సొంతం చేసుకున్నారని ఆయన వివరించారు. కళాశాలలోని నాణ్యమైన బోధనా విధానం, అధ్యాపకుల మార్గదర్శకత్వం, విద్యార్థినుల కఠోర శ్రమ వల్లే ఈ అద్భుత విజయాలు సాధ్యపడ్డాయని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత విద్యలో మహిళలు మరింత ముందుకు రావాలని ఆకాంక్షిస్తూ.. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## పేదల ఇంటి వద్దకే భరోసా..

### ఎన్టీఆర్ పెన్షన్లు పంపిణీ చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



కాకినాడ, మహి న్యూస్, జూన్ 1 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద లబ్ధిదారులకు రాజ్యసభ సభ్యులు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు సోమవారం పెన్షన్లు పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కాకినాడ నగరపాలక సంస్థ 1వ డివిజన్ రమణయ్యపేటలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పారదర్శకంగా అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ, పేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేయడం వల్ల లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాపత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకె శ్రీనివాస్ బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మేకా లక్ష్మణ్ మూర్తి, వి వై దాసు,మాజీ కార్పొరేటర్ లోవబాబు, టిపిఆర్ఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం



ప్రకాశం / ఒంగోలు, మహి న్యూస్, జూన్ 01 : పేదల పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ఒంగోలులోని సంతపేటలో రూ. 6 కోట్లతో నిర్మిస్తున్న ఎస్సి గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు మంత్రి డిఎస్ బీవీ స్వామి పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని మంత్రి అధికారులకు సూచించారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పీఎం అజయ్ కింద రూ. 86 కోట్లతో రాష్ట్రంలో 25 నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నాం. సాస్కి నిధులు రూ. 200 కోట్లతో రాష్ట్రంలోని హాస్టళ్లకు మరమ్మతులు, అదనపు భవనాలు నిర్మిస్తున్నాం. రూ.143 కోట్లతో 700 హాస్టళ్లకి మరమ్మతులు చేశాం. రూ. 58 కోట్లతో అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అదనపు మరుగుదొడ్లు నిర్మించాం. ఒంగోలులో దివ్యాంగ విద్యార్థుల కోసం రూ.3 కోట్లతో ప్రత్యేకంగా హాస్టల్ నిర్మిస్తున్నాం. త్వరలోనే మెస్ చార్జీలు పెంచుతాం. తిరుపతి, విజయవాడ, విశాఖ స్టడీ సర్కిళ్లలో 450 మందికి ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇస్తున్నాం. వీటితో పాటు ఒంగోలు, అమలాపురంలో నూతనంగా స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తాం. 250 మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టాం. పేదల పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు అవ్వాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం. అందుకనుగుణంగా ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లను 3 నుంచి 13 కి పెంచాం. మరో 12 పెంచి 25 జిల్లాలకు 25 ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



# 12 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం... ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం

## 'విశాఖ రైల్వే జోన్' సాకారం కేంద్ర మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు



ఇచ్ఛాపురం, మహి న్యూస్, జూన్ 1: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లో అత్యంత వైభవంగా నిర్వహించిన రైల్వే జోన్ ప్రారంభోత్సవ అధికారిక కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు అత్యంత భావోద్వేగంతో మాట్లాడుతూ, విశాఖ రైల్వే జోన్ సాధన కోసం గత 12 సంవత్సరాలుగా తాను సాగించిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్లమెంట్లో ఈ అంశంపై అనేకసార్లు గళమెత్తానని, ఇదే ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లో ప్రజాప్రతినిధిగా దీక్షలు కూడా చేపట్టానని పేర్కొన్నారు. "అనాడు ఒక సామాన్య ప్రజాప్రతినిధిగా ప్రజల పక్షాన నిలబడి పోరాడాను.. ఈరోజు కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలోనే ఆ కల సాకారం కావడం, నా చేతుల మీదుగానే ఈ జోన్ ప్రారంభం కావడం నా జీవితంలో ఎప్పటికీ మరువలేని మహత్తర ఘట్టం" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ రోజు నుండి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన ప్రారంభమైందని కేంద్ర మంత్రి వెల్లడించారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారాలు లభిస్తాయని, పరిపాలన మరింత సులభతరం అవుతుందని చెప్పారు. గతంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు గారు కూడా ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడమే లక్ష్యంగా విశేష కృషి చేశారని, వారి ఆశయాలను ఈరోజు నెరవేర్చగలిగామని సగర్వంగా ప్రకటించారు. దాదాపు పుష్కర కాలంగా ఈ పవిత్ర ఆకాంక్షను భుజాలపై మోస్తూ, చివరకు అనుకున్నది సాధించామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.3,300 కోట్ల భారీ వ్యయంతో 50కి పైగా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో ఇచ్ఛాపురం ప్రాంతానికి కూడా ఒక కీలకమైన ఆర్ఓబీ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న వంతెన సమస్యకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనే పూర్తిస్థాయి ముగింపు పలుకుతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పట్టణ ప్రగతికి, ప్రజల రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా శాశ్వత పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే, నూతనంగా సాధించిన పూరి--అహ్మదాబాద్ రైలు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఈ రైలు సేవలు నేరుగా ఇచ్ఛాపురం నుంచే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని తన ఆకాంక్షను వెల్లడించారు.

### రూ.400 కోట్లతో ప్రధాన కార్యాలయ నిర్మాణం:

విశాఖపట్నంలో 54 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో, సుమారు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే శరవేగంగా ప్రారంభమయ్యాయని కేంద్ర మంత్రి సమాచారం అందించారు. ఈ చారిత్రాత్మక పండుగ తరుణంలో తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే జోన్‌ను మంజూరు చేసిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇందుకు నిరంతరం సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి జిల్లా ప్రజల తరఫున కేంద్ర మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతమైన ఏ.ఎస్.పేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డును ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడే మొక్కలు నాటారు. అనంతరం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 22వ వార్డులో లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులతో మంత్రి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బహిరంగ సభలో మాట్లాడి అనంతరం రైలులో ఇచ్ఛాపురం నుంచి పలాస బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లా ఉన్నతాధికారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధుల సమస్య పరిష్కారానికి కమిటీ

### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం/ సంతబొమ్మాళి, మహి న్యూస్, జూన్ 1: గ్రామ ప్రజలకు పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధి సోకడానికి గల కారణాలను పరిశోధించడానికి సర్వే బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం తోటాడ గ్రామంలో ప్రజా సేవలో భాగంగా గడప గడపకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను మంత్రి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కిడ్నీ సమస్య ఉన్నందున నీటి ద్వారా లేక ఇతర కారణాల వలన కిడ్నీ వ్యాధి సోకుతుందన్న విషయాలు పరిశోధన చేసేందుకు సర్వే బృందాన్ని పంపించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి టెక్కలి నియోజకవర్గం లోనీ గ్రామాలకు ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే బృహత్కర కార్యక్రమానికి ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.620 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తొలి విడత లో వంద కోట్లు కేటాయించినట్లు వివరించారు. గత ప్రభుత్వంలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కోటబొమ్మాలి నుండి తోటాడ గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టామని, తోటాడ, బలరాంపురం గ్రామాల అభివృద్ధి పనులకు సుమారు రూ.72 లక్షల వరకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గడిచిన 24 మాసాల్లో ఎవరు ఊహించని విధంగా అభివృద్ధి పనులు చిత్తశుద్ధితో చేశామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా ప్రణాళికతో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. గత 24 నెలల్లో 65 లక్షల మంది లబ్ధిదారులకు రూ.65 వేల కోట్ల మేర పింఛన్లు అందించామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి సమగ్ర మౌలిక సదుపాయాలు అందించి అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే జోన్ ఏర్పాటుకు అవసరమైన 54 ఎకరాల భూమిని కేటాయించకుండా కాలయాపన చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుచేసి కార్యకలాపాలు మొదలు అయ్యే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. మహిళలు ఇప్పటివరకు డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత ఖాతాలో సొమ్ము జమ అయ్యేదని, ఇకపై మహిళలకు గ్యాస్ సిలిండర్ ఇబ్బంది లేకుండా ఏడాదిలో ఎప్పుడైనా మూడు గ్యాస్ సిలిండర్లు తీసుకునే విధంగా కూపన్లను త్వరలో పంపిణీ చేయునట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని రూ. 37 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాన్నీ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆర్డీఓ ఎమ్ .కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.సుధాకర్ రావు, తాసిల్దార్ హేమసుందర్మం రావు, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి అప్పారావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్.రామ కృష్ణ, తదితరులు, పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్ ప్రారంభంతో ఉత్తరాంధ్రలో నూతన శకం

### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

పలాస, మహి న్యూస్, జూన్ 1: దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక కార్యకలాపాలు నేటి నుండి పూర్తిస్థాయిలో ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర రవాణా, ఆర్థిక రంగాల అభివృద్ధిలో ఒక చారిత్రాత్మక మైలురాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. నూతన రైల్వే జోన్



ప్రారంభోత్సవ పండుగ వాతావరణంలో భాగంగా ఇచ్ఛాపురం నుంచి రైలులో సోమవారం పలాస చేరుకున్న కేంద్ర మంత్రికి స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆధ్వర్యంలో కూటమి నాయకులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పలాసలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు




సాకారం కావడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంత రైల్వే సమస్యల పరిష్కారం కోసం, కొత్త రైళ్ల మంజూరు కోసం భువనేశ్వర్ లేదా సికింద్రాబాద్ వైపు చూడాల్సి వచ్చేదని, ఇకపై ఆ అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల రైల్వే పరిపాలన నిర్ణయాలు జరుగుతాయని స్పష్టం చేశారు. పలాస రైల్వే స్టేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రయాణికుల వసతుల ఆధునికీకరణకు ఈ జోన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. రైల్వే జోన్ పరిధిలోని ప్రతి ప్రాజెక్టును వేగవంతం చేసి, ఉత్తరాంధ్ర ప్రజల నమ్మకాన్ని నిలబెడతామన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి సూచికగా వేదికపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూటమి నాయకులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష, స్థానిక నేతలు కేంద్ర మంత్రిని శాలువాలు, పూలదండలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేంద్ర మంత్రి నేరుగా పలాస రైల్వే స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్లను సందర్శించారు. అక్కడ ఉన్న ప్రయాణికులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, కౌంటర్ల పనితీరు, రైళ్ల రాకపోకల సమాచారం మరియు స్టేషన్‌లో అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

### కూటమి హయాంలోనే రైల్వే జోన్ కల సాకారం - ఎమ్మెల్యే గౌతు శిరీష:

ఈ బహిరంగ సభలో పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునే నిజమైన ప్రజా ప్రభుత్వమని కొనియాడారు. ఉత్తరాంధ్ర ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైల్వే జోన్ కార్యకలాపాలు నేటి నుండి ప్రారంభం కావడం వెనుక కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి, పోరాటం ఉన్నాయని ప్రశంసించారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రానికి, ముఖ్యంగా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత పాలకులు రైల్వే జోన్ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పనులను వేగవంతం చేసి కార్యకలాపాలను ప్రారంభ దశకు తీసుకువచ్చిందని శిరీష పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పలాస నియోజకవర్గ పరిధిలోని మరికొన్ని రైల్వే సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కారాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ ఉన్నతాధికారులు, పలాస నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## అర్జీదారులకు సత్వరమే పరిష్కారం జరగాలి

### 164 అర్జీలు స్వీకరణ



శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 01: తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు పెట్టుకున్న పిటీషన్ దరఖాస్తులను సత్వరమే పరిశీలనచేసి వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు పెండింగ్ లో లేకుండా పరిష్కారం చేయాలన్నారు. నాణ్యమైన సమాచారంతో అర్జీదారుని సంతృప్తి పరచి పరిష్కారం చూపాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన అర్జీల స్వీకరణలో 164 అర్జీలు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ (సిసిఎల్ఏ) 75, పంచాయతీ రాజ్ 18, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ 10 , సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు 11, ఎపిఈపిడిసీయల్ 7, మున్సిపల్ పరిపాలన 6, రూరల్ డెవలప్మెంట్ 5, హోం శాఖ 5, వాటర్ రీసోర్స్ 3,పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ 3, రోడ్లు మరియు భవనాల శాఖ 3, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 3, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ 2, హౌసింగ్ , వ్యవసాయ శాఖ , బిసి సంక్షేమం, గ్రౌండ్ వాటర్, ఏపీఎస్ఆర్టీసీ, ఇండస్ట్రీ స్, సమగ్ర శిక్ష, పబ్లిక్ హెల్త్, లేబర్, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్, మైన్స్ అండ్ జియాలజీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, సోషల్ వెల్ఫేర్, శాఖలకు సంబంధించి ఒక్కొక్క దరఖాస్తు చొప్పున స్వీకరించారు. అర్జీల స్వీకరణలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డీఎ పి.డి. కిరణ్ కుమార్ ఉన్నారు. మీ కోసం కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, లావణ్య, జడ్పీ సీఈఓ వెంకట్రామన్ ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్




హైదరాబాద్: హైదరాబాద్‌లోని సచివాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ఉద్యోగ సంఘాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమావేశం నిర్వహించారు. అనంతరం కీలక వివరాలు వెల్లడయ్యాయి. రెండు రోజుల్లో ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్ట్ ద్వారా ఇది అమలు అవుతుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యమని సీఎస్ రామకృష్ణారావు అన్నారు. ఉద్యోగ సంఘాల సూచనలతో ట్రస్ట్ మార్గదర్శకాలు రూపొందిస్తామని తెలిపారు. ట్రస్ట్‌కు ప్రత్యేక బ్యాంకు ఖాతా.. ప్రభుత్వం-ఉద్యోగుల సమాన వాటా ఉంటుందని వివరించారు. పూర్తి స్వయం ప్రతిపత్తితో ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ పనిచేయనుంది. లబ్ధిదారుల ప్రయోజనాల కోసం స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ట్రస్ట్ పాలన, ఆర్థిక నిర్వహణపై ఉద్యోగ సంఘాల నుంచి కీలక సూచనలు వచ్చాయి.

### ట్రస్ట్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను స్వాగతిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక వేతనంపై 1.5% కోత విధించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు. ఉద్యోగి వాటాను బేసిక్ పేతో కాకుండా కుటుంబ సభ్యుల ఆధారంగా నిర్ణయించాలని చెప్పారు.

## తిరుపతి నగరంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



తిరుపతి మహి న్యూస్ జూన్ 01: తిరుపతి నగరంలోని 3వ వార్డులో జనసేన పార్టీ ఇంచార్జి మధు రాయల్ చింతంశెట్టి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు రాయల్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులకూ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు పెన్షన్ అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## టీటీడీ ఎస్.వి సంగీత, నృత్య కళాశాలలో 2026-27 ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




తిరుపతి,మహి న్యూస్,జూన్ 1: తిరుపతిలోని టీటీడీ శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం & డోలు పాఠశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల ఒక ప్రకటనలో తెలిపారు. గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి నృత్యం, హరికథ, మృదంగం వంటి విభాగాల్లో సర్టిఫికెట్, డిప్లొమా రెగ్యులర్ కోర్సులతో పాటు సాయంత్రం పార్ట్‌టైమ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రెగ్యులర్ కోర్సులకు ఎనిమిదో తరగతి, పార్ట్‌టైమ్ కోర్సులకు ఐదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

### దరఖాస్తుల గడువు

ఈ ప్రవేశాలకు సంబంధించి జూన్ 3వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. కళాత్మక అభిరుచి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర పూర్తి వివరాల కోసం 0877–2264597, 98483 74408, 94407 93205, 96427 96991 నంబర్లలో సంప్రదించవచ్చని తిరుపతి శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల ఆ ప్రకటనలో తెలియజేశారు

## గ్రామీణ యువత ఉపాధి సాధనకు డీడీయూ-జీకేవై శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి



కర్నూలు, మహి న్యూస్, జూన్ 01: గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు నాణ్యమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ–జీకెవై 2.0) కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో డీడీయూ–జీకేవై 2.0 ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల ప్రచార పోస్టర్‌ను సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఆధునిక ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. డీడీయూ–జీకేవై 2.0 ద్వారా కస్టమర్ ఇంగ్లీష్, హాస్పిటాలిటీ, టెలికాం, గ్రీన్ జాబ్స్ వంటి డిమాండ్ ఉన్న రంగాల్లో 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతకు పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు సంబంధిత రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్లేస్‌మెంట్ సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నైపుణ్యాల పెంపుదల ద్వారా యువత ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు తమ కుటుంబాల అభివృద్ధికి కూడా తోడ్పడగలరని అన్నారు. జిల్లాలో అర్హులైన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో నమోదు చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ సుబ్బయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి, నైపుణ్యాభివృద్ధి ఉపాధి కల్పన అధికారి దీప్తి, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, స్వర్ణ గ్రామ /స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కుదరదు



కర్నూలు, మహి న్యూస్, జూన్ 1 : పారిశుద్ధ్య నిర్వహణలో పర్యవేక్షక సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకోక తప్పదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. సోమవారం ఆయన 5వ శానిటేషన్ డివిజన్‌లో మస్టర్ తనిఖీ చేశారు. అలాగే నరసింహారెడ్డి నగర్, వెంకటరమణ కాలనీ, కంట్రోల్ రూమ్, గాంధీనగర్, రాజ్‌విహార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరి కార్మికుల ఒకరోజు వేతనం కోత విధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పైస్థాయి అధికారులు ఇచ్చిన ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కిందిస్థాయి ఉద్యోగులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయాలని సూచించారు. చెత్త సేకరణకు వెళ్లే వాహనాల్లో డస్ట్‌బిన్లు, బకెట్లు, పారలు, చీపుర్లు, నెట్ వంటి పనిముట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ప్రధాన రహదారులపై చెత్త కుప్పలు ఎక్కువసేపు ఉండరాదని, లేకపోతే గాలికి చెల్లాచెదురుగా మారుతాయని అన్నారు. ప్రత్యేక పూడికతీత



పనులను ఇంజినీరింగ్ విభాగ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, పనులు జరిగే సమయంలో తప్పనిసరిగా అక్కడే ఉండాలన్నారు. పిన్ పాయింట్ ప్రోగ్రామ్‌ను పక్కాగా అమలు చేయాలని, వాహనాలకు మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. అదే విధంగా కొండారెడ్డి బురుజు వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, అనిల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్ళాలి




కర్నూలు, మహి న్యూస్, జూన్ 1 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంతో పాటు వివిధ రూపాల్లో వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలని, కింది స్థాయి సిబ్బందిని బాధ్యులు చేయడం సరికాదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. సోమవారం. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీల ప్రజల నుండి 16 అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, మేనేజర్ & ఆర్వో జునైద్, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఇంచార్జీ సిటి ప్లానర్ వెంకటరమణ, ఆర్వోలు స్వర్ణలత, వాజిద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు సృజనాత్మక పోటీలు




కర్నూలు, మహి న్యూస్, జూన్ 01: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ మరియు వాతావరణ మార్పుల పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ), కర్నూలు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో వివిధ సృజనాత్మక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ), కర్నూలు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంబంధించిన పోస్టర్ ను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ఈ పోటీలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మరియు కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు మరియు పర్యావరణ బాధ్యతాభావాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో పోస్టర్ & డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం, రీల్/షార్ట్ వీడియో తయారీ, వ్యర్థ పదార్థాలతో వినూత్న వస్తువుల తయారీ, ఫోటోగ్రఫీ, సైన్స్ & ఇన్నోవేషన్ మోడల్, స్లోగన్ రచన వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్ "ఇమ్మెర్జ్ బై నేచర్, ఫర్ క్లైమేట్, ఫర్ అవర్ ఫ్యూచర్" గా నిర్ణయించబడిన నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, పచ్చదనం పెంపు, కాలుష్య నివారణ మరియు సుస్థిర అభివృద్ధి అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పాల్గొనుటకు ధ్రువపత్రాలు (సర్టిఫికెట్స్) అందజేయడంతో పాటు ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. యువతలో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాభావం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు, నమోదు ప్రక్రియ కోసం విడుదల చేసిన పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చని లేదా సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని, భావితరాలకు పరిశుభ్రమైన, హరితభరితమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి విద్యార్థి తన వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి.వి. కిషోర్ రెడ్డి, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో వెంకట రమణారెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

## మొండి బకాయిదారుల షాపులు సీజ్ చేయండి

కర్నూలు, మహి న్యూస్, జూన్ 1 : నగరంలో ఉన్న మున్సిపల్ షాపుల అద్దె బకాయిలను చెల్లించకుండా ఉన్న దుకాణాలను వెంటనే సీజ్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ విభాగ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొంతమంది సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వస్తుందని, పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పన్ను విధింపు, సవరణ, పేరు మార్పు వంటి సేవలను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని, నిర్దేశిత గడువులోపు దరఖాస్తులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీ ఉన్న మున్సిపల్ షాపులకు వెంటనే వేలంపాట నిర్వహించాలని, 25 ఏళ్లు పూర్తి అయిన షాపులకు కొత్త జీవో ప్రకారం నిబంధనలకు అనుగుణంగా రెన్యువల్ చేయడానికి లీజుదారుడి నుండి సమ్మతి తీసుకోవాలన్నారు. గడువు తీరిన షాపులపై బకాయిలు ఉంటే నోటీసులు జారీ చేసి కేసులు సైతం పెట్టాలన్నారు. వీలైనంత త్వరగా 80% బకాయిలను రాబట్టాలని స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలు నగరపాలక సంస్థలో ముఖ్యంగా రెవెన్యూ విభాగంలో పన్ను విధింపు, వియల్‌టి విధింపు, పన్ను సవరణలు, పేరు మార్పు వంటి సేవల కోసం ఎవరైనా నగదు అడుగుతున్నట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 9766 కు లేదా నేరుగా తన (కమిషనర్) నంబర్ 8106228899 కు ఫిర్యాదు చేయాలని కోరారు. అవినీతిని ఏమాత్రం సహించబోమని, ప్రజలు అవినీతి నిర్మూలనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్, ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు వద్దు... ప్రభుత్వ బడే ముద్దు!

### బడి పండుగలో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ




పులివెందుల /తొండూరు, మహి న్యూస్ జూన్ 1: తొండూరు మండలం భద్రంపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని అవగాహన కల్పిస్తూ సోమవారం "బడిపండుగ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేలా ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లిన ఉపాధ్యాయులు పవన్ కుమారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలల కోసం అధిక మొత్తంలో ఫీజులు చెల్లించి ఆర్థిక భారం మోసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని, ప్రతి చిన్నారికి ఉత్తమ విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యను అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చదివిన బడినే చిదిమేస్తున్న యువకులు..!

### కుళాయిలు, టాయిలెట్లు, గేట్లపై ధ్వంసకాండ

### – ఆందోళనలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు



పులివెందుల /తొండూరు,మహి న్యూస్ జూన్ 1: తొండూరు మండలంలోని భద్రంపల్లె ప్రభుత్వ పాఠశాలలో గుర్తుతెలియని యువకులు ధ్వంసకాండకు పాల్పడుతున్న ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. వేసవి సెలవులు కావడంతో పాఠశాల ప్రాంగణానికి ఆడుకోవడానికి, గుమిగూడేందుకు వస్తున్న కొందరు యువకులు పాఠశాల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను విరగ్గొట్టడంతో పాటు గేట్ల తాళాలు ధ్వంసం చేయడం, టాయిలెట్లను పాడుచేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి కల్పించిన మౌలిక సదుపాయాలు కొందరి నిర్లక్ష్య ధోరణి కారణంగా నిర్వీర్యమవుతున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలనే లక్ష్యంగా చేసుకుని కొందరు యువకులు ధ్వంసకాండకు పాల్పడటం బాధాకరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం, దాతలు ఖర్చు చేస్తున్న నిధులు వృథా కావడంతో పాటు భవిష్యత్తులో విద్యార్థులు తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ధ్వంసమైన కుళాయిల దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆస్తులను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని గ్రామస్తులు విద్యాశాఖ, పోలీసు అధికారులను కోరుతున్నారు. "పాఠశాలలు విద్యను అందించే దేవాలయాలు.. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అని గ్రామ పెద్దలు సూచిస్తున్నారు.

## కూలడానికి సిద్ధంగా ఉన్న గుత్తి బస్టాండ్






గుత్తి మహి న్యూస్ జూన్ 1.: మూడు సంవత్సరాల కిందట గుత్తి బస్టాండ్ పై కప్పు పెచ్చులూడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అప్పుడు కేవలం ఒక చోట కూలింది. ఇప్పుడు పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. అసలే వేసవి కాలం ఆరుబయట నిలుచుందామంటే నిప్పులు కక్కే ఎండ. బస్టాండ్ ఆవరణము అంతా విపరీతమైన దుర్గంధం. ఎక్కడ చూసిన ఉచ్చల మడుగు. కాలుదీసి కాలు పెట్టడానికి భరతనాట్యం చేయాల్సిందే. దీనికి తోడు విపరీతమైన రద్దీ. ఉచిత బస్సు పథకం ఆంధ్ర కన్నా ముందు తెలంగాణ కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల్లో ఉంది. కానీ అక్కడ ఇక్కడ స్పష్టమైన తేడా గమనించవచ్చు. అక్కడ బస్సులు సాధారణంగా ఉంటాయి. కానీ ఇక్కడ బస్సులు మధ్యాహ్నం తప్ప మిగతా సమయాల్లో సీటు దొరికితే అదృష్టం. ఇక బస్టాండ్ లో వేచి ఉండమంటే పై కప్పు ఎప్పుడు కూలుతుందో అని భయం భయం తో ఉండాల్సిన పరిస్థితి. మొన్న పై కప్పు సీలింగ్ కంకర నీళ్లు తాగే చలివేంద్రం పై పడితే నీటి బాన ముక్కలయింది. అదృష్టవశాత్తు అక్కడ ప్రయాణికులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇక గుంతకల్లు వెళ్లే ప్లాట్ ఫార్మ్ పైన లింటల్ కూలి సంవత్సరాలవుతుంది. మరుగుదొడ్లు మరి దుర్భరంగా ఉన్నాయి. ముక్కు మూసుకొని పనికానిచ్చే బదులు ఎక్కడో ఒక మూలకు కళ్ళుమూసుకుని పనికానిస్తే సరిపోతుందని ప్రయాణికులు భావిస్తున్నారు. ఇక బస్టాండులో ఉన్న హోటల్స్ శుచి శుభ్రత లేకుండా ఉంటుంది. ధరల నియంత్రణ లేనే లేదు. బయట హోటల్స్ ఎప్పుడు దుమ్ము కొట్టుకు ఉంటున్నాయి. మున్సిపల్ శానిటేషన్ అధికారులు కళ్ళుమూసుకున్నారు. దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతంలో కనీసం ఒక మరుగుదొడ్డి కూడా లేకుండా ఉంది. ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంది. పక్కనున్న తాడిపత్రి చూసైనా ప్లాస్టిక్ సున్నా స్థాయికి తీసుకెళ్లే పరిస్థితి లేదు. అసలే ఇరుకైన రోడ్డులో అడ్డంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు కట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా డిమాండ్ లేని వాళ్ళ ముఖాలను ఫ్లెక్సీల్లో చూసుకుని తరించాలి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు సత్వరమే సీలింగ్ పనులు శాశ్వత ప్రాతిపదికన చేపడితే ప్రజల ప్రాణాలు నిలుస్తాయి. అలాగే మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలు నిషేధిస్తే మంచిది. సత్వరమే మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టి ఆదర్శ పట్టణంగా గుత్తి ని తీర్చిదిద్దాల్సిన భాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా ముచ్చుకోట సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీ బాయినేని నాగేంద్ర ప్రసాద్, పౌర స్పందన అధ్యక్షులు ప్రొ వెంకట శివారెడ్డి కోరారు.





## పింఛన్లు పంపిణీ చేస్తూ... యోగ క్షేమాలు తెలుసుకుంటూ...



గుంటూరు, మహి న్యూస్, జూన్ 1 : ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సోమవారం మంగళగిరిలో పంపిణీ చేశారు. ప్రజలతో మమేకమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ వారి ఆరోగ్యం, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏ విధంగా అందుతున్నాయని ఆరా తీసారు. సమయానికి పింఛను అందుతుందా?, సిబ్బంది ప్రవర్తన ఏవిధంగా ఉంది వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,53,379 మంది పింఛనుదారులకు రూ.110.50 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను ఎంతో ప్రాధాన్యతతో ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో మొత్తం



పింఛన్లలో వృద్ధాప్యపు పింఛన్లు 1,13,860., వితంతువులు 71,608., చేనేతకారులు 3,765., గీతకార్మికులు 443., మత్స్యకారులు 564., ఒంటరి మహిళలు 11,265., చర్మకారులు 866., హిజ్రాలు 67., హెచ్.ఐ.వి బాధితులు 2,580., కళాకారులు 74., డప్పు కళాకారులు 847., దివ్యాంగులు 24,493., వైద్య సంబంధిత పింఛనుదారులు 1,587., సైనిక సంక్షేమం 25., అభయహస్తం 3,932., అమరావతి భూముల సంబంధిత 17,413 పింఛన్లు పంపిణీ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, అదనపు కమిషనర్ శకుంతల, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణహితంగా ఆలోచించండి .. పర్యావరణహితంగా వ్యవహరించండి ..

### పర్యావరణహితంగా.. జీవించండి

### జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ




గుంటూరు, మహి న్యూస్, జూన్ 1 : పరిశ్రమల్లో పర్యావరణ అనుకూల విధానాలు అమలు ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించే భాధ్యత తీసుకోవాలని పారిశ్రామికవేత్తలకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. జూన్ 5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి "ఒక పరిశ్రమ – ఒక హరిత చొరవ" నినాదం తో రూపొందించిన వాల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే శక్తి ప్రతి పరిశ్రమకూ ఉందని, కావున ముందుండి నడిపించి, మార్పుకు కారకులవడమే కాకుండా ఇతరులకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. వ్యర్థాలను తగ్గించి, వాటిని పునర్వినియోగించి పునరుత్పత్తి చేయడమే కాకుండా వనరులను పునరుద్ధరించడం, నీటి సంరక్షణ, సుస్థిరమైన రేపటి కోసం ఈరోజే శక్తిని ఆదా చేయడం, పచ్చదనాన్ని పెంచి, గాలి నాణ్యతను మెరుగుపరచడం వంటి పర్యావరణ అనుకూల కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఖాజావలి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నజీనా బేగం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

